నమస్తే తెలంగాణ
నల్లగొండ
I | నల్లగొండ, సోమవారం 12 మే 2025 | NALGONDA

కనిలాల్ నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, కిశోర్‌కుమార్, నాయకులు

కనిలాల్ సేవలు ఎనలేనివి

● మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

దేవరకొండ రూరల్, మే 11 : రమావత్ కనిలాల్ నాయక్ ప్రభుత్వ ఉద్యోగిగా, ప్రజాప్రతినిధిగా ఎనలేని సేవలు చేశారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్ నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని శేరిపల్లి గ్రామంలో ఆదివారం ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనిలాల్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. అనంతరం రవీంద్రకుమార్ మాట్లాడుతూ తమ తండ్రి నుంచి క్రమశిక్షణ, ప్రజాసేవ వంటి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. ప్రజాప్రతినిధిగా ప్రజాసేవ చేస్తూ గుర్తింపు తెచ్చుకోవడానికి తమ నాన్నే ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యాపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కరాటే విద్యార్థులు

భారత సైన్యానికి మద్దతుగా కరాటే విద్యార్థుల ర్యాలీ

సూర్యాపేట టౌన్, మే 11 : ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పాక్‌పై పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా కరాటే విద్యార్థులు సూర్యాపేట పట్టణంలో ఆదివారం జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇటీవల యుద్ధంలో అమరుడైన అగ్నివీర్ మురళీ నాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. కరాటే మాస్టర్ జేవీ రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్ఐ నీలిమ, కరాటే మాస్టర్లు సంతోష్, సాయి కిరణ్, రిషి, శ్రీమన్నారాయణ, నిఖిల్, బాలికల కోచ్‌లు గీతిక, చైతన్య, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

దాసిరెడ్డిగూడెంలో కునపురి రాములు స్మారక స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు క్యామ మల్లేశ్ తదితరులు

కునపురి రాములు ఆశయ సాధనకు కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

వలిగొండ, మే 11 : తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ మావోయిస్టు కునపురి రాములు ఆశయ సాధకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. రాములు 11వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం దాసిరెడ్డిగూడెంలోని స్మారక స్థూపం వద్ద ఆదివారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కునపురి రాములు, కునపురి సాంబశివుడు రాష్ట్ర సాధనతోపాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, నిరుపేదల పక్షాన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు మొగుళ్ల శ్రీనివాస్, పనుమటి మమత, ముద్దసాని కిరణ్‌రెడ్డి, డేగల పాండరి, కునపురి కవిత, సంజీవరెడ్డి, రమేశ్, స్వర్ణలత, మల్లేశ్, అఫ్రోజ్, శాంతికుమార్, నరేశ్‌రెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణ, కునపురి సోదరుల అభిమానులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్

- కోమటిరెడ్డి ఆర్ అండ్ బీ మంత్రిగా ఉన్నా రోడ్లు వేయలేని దుస్థితి
- బీర్ల ఐలయ్యకు భూ దందాలపై ఉన్న మక్కువ అభివృద్ధిపై లేదు
- రైతులను ఆదుకునేందుకు లేని డబ్బులు.. అందాల పోటీలకు ఎలా వచ్చాయి?
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

గుండాల, మే 11 : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అనేక అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వడానికి చేతగాని ప్రభుత్వం.. అందాల పోటీలు పెడుతుందన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ హయాంలో సబ్బండ వర్గాలను కంటికి రెప్పలా కాపాడుకున్నామని గుర్తు చేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్ అండ్ బీ మంత్రిగా ఉన్నా రోడ్లు వేయలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీత కృషితో ఆలేరు నుంచి గుండాల మీదుగా మోత్కూరు వరకు రూ.42కోట్లతో డబుల్ రోడ్డు వేశారన్నారు. జీడికల్ గ్రామం వద్ద 2 కిలోమీటర్లు జనగామ జిల్లా పరిధిలో ఉండటంతో అక్కడ రోడ్డు వేసే అవకాశం లేదని తెలిపారు. ఆ రోడ్డు వేయాలని నాడు భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విన్నవించినా వేయలేదన్నారు. ప్రస్తుతం ఆర్ అండ్ బీ మంత్రిగా ఉన్నా ఫలితం లేదని ఎద్దేవా చేశారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు భూ దందాలపై ఉన్న మక్కువ అభివృద్ధిపై లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని, కేసీఆర్ కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పురుగుల మత్స్యగిరి, కూనగళ్ల గణేశ్, కందుకూరి చందు, ఆకుల సాంబయ్య, జెనిగల మధు పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ

కేతావత్ అఖిల

దేవరకొండరూరల్, మే11: దేవరకొండ మండలంలోని పెంచికల్ పహాడ్‌లో ఉన్న గురుకుల సీఓయికి చెందిన కేతావత్ అఖిల ఆదివారం వెలువడిన ఎప్‌సెట్ ఫలితాల్లో ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగంలో 901 ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కళ్యాణి తెలిపారు. ఆమన్‌గల్ మండలం మారుమూల మంగలికుంట తండాకు చెందిన అఖిల ప్రభుత్వ గురుకులంలో చదివి ఉత్తమ ర్యాంకు సాధించినందుకు తల్లిదండ్రులు రతన్, జ్యోతి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

కోతల కోసం కొర్రీలు?

సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల కుదింపునకు సర్కారు కుట్రలు

- అర్హతలపై రోజుకో తీరు ఆదేశాలు
- భారం తగ్గించుకోవడమే ప్రభుత్వ లక్ష్యం
- రాజీవ్ యువ వికాసంలో సిబిల్ స్కోర్ నిబంధన
- ఇందిరమ్మ ఇండ్లల్లో నిర్మాణ స్థల విస్తీర్ణం మెలిక
- ఆత్మీయ భరోసాలో 20 రోజుల ఉపాధి హామీ పని దినాలు
- రేషన్ కార్డుల జారీలో పేర్ల తొలగింపు
- రైతు భరోసాలో సాగు భూమి విస్తీర్ణం

నల్లగొండ ప్రతినిధి, మే 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన సంక్షేమ పథకాల్లో ఎంత వీలైతే అంత కోతలు వేసేందుకు కొర్రీల మీద కొర్రీలు పెడుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ పథకాన్ని పరిశీలించినా ఏదో విధంగా లబ్ధిదారుల సంఖ్యను సాధ్యమైనంత మేర కుదించి ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించుకునేలా కుట్రలు చేస్తుందన్న అనుమానాలు నెలకొన్నాయి. అర్హులందరికీ పథకాలు ఇస్తామంటూనే నిబంధనల పేరిట అడ్డగోలు కొర్రీలు పెడుతుంది. మెజారిటీ పథకాలకు ఏదో ఒక మెలిక పెట్టి లబ్ధిదారులను తగ్గిస్తుంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఉచిత కరెంటు, సబ్సిడీ గ్యాస్‌లో అనేక కొర్రీలతో లబ్ధిదారుల సంఖ్య పెరుగకుండా జాగ్రత్తలు పడుతుంది. తాజాగా నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పిస్తామని చెప్పి రాజీవ్ యువ వికాసం పేరిట అమలు చేస్తున్న పథకంలో కఠిన నిబంధనలు పెట్టింది. 50వేల రూపాయల నుంచి రూ.4లక్షల వరకు సబ్సిడీపై రుణాలు ఇస్తామని చెబితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేల సంఖ్యలో యువత దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల ప్రక్రియ ముగిశాక సిబిల్ స్కోర్ ఉన్న వారికి రుణాలు ఇస్తామని కొత్త మెలిక పెట్టడంతో యువత ఖంగుతిన్నారు.

ఆత్మీయ భరోసాలోనూ..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట తెచ్చిన మరో పథకంలోనూ ఇదే పరిస్థితి. వ్యవసాయ కూలీలకు ప్రతి ఆరు నెలలకోసారి రూ.6వేల చొప్పున ఏడాదికి 12వేల రూపాయలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే.. ఇందులో ఉపాధి హామీ కార్డు ఉండి ఏడాదికి కనీసం 20 రోజులు పని చేసి ఉండాలనే నిబంధన పెట్టింది. దీంతోపాటు లబ్ధిదారుడికి గుంట భూమి కూడా అతని పేరు మీద ఉండవద్దని మరో మెలిక పెట్టింది. దీంతో ఒక గ్రామంలో పదుల సంఖ్యలో ఉన్న వ్యవసాయ కూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు దూరమయ్యారు. ప్రభుత్వం ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల్లో సైతం 10 నుంచి 20 మందికి ఎక్కడా లబ్ధిదారుల సంఖ్య మించకపోవడం గమనార్హం. రేషన్ కార్డు కూడా భూమితో లింకు పెట్టారు. కొత్త రేషన్ కార్డు కావాలంటే ముందుగా పాత రేషన్ కార్డులో పేరు తొలిగించుకోవాల్సిందేనని షరతు పెట్టగా చాలా మంది మీ సేవలో దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. కానీ.. ఇందులో తీవ్ర గందరగోళం నెలకొంది. ఇక రైతు భరోసా విషయంలోనూ ప్రభుత్వం సాగు చేస్తున్న వారికే భరోసా అంటూ తొలుత మెలిక పెట్టింది. తర్వాత వెనక్కి తగ్గినా నేటికీ నాలుగు ఎకరాలకు మించి యాసంగి రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి సీజన్‌లో రూ.7500 చొప్పున రైతు భరోసాగా అందిస్తామని ప్రకటించి ప్రస్తుతం దాన్ని 6వేల రూపాయలకే కుదించిన విషయం తెలిసిందే. 6వేల రూపాయలు సైతం యాసంగి సీజన్ ముగిసినా ఖాతాల్లో పడకపోవడంతో ప్రభుత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిగతా పథకాల్లోనూ కోతలకే పెద్దపీట

ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తున్న కొన్ని పథకాల్లోనూ ప్రభుత్వం ఇవే కొర్రీలు పెడుతుంది. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రధానమైన హామీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇండ్లకు కూడా మెలిక పెట్టింది. జనవరి 26న లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేసిన ప్రభుత్వం.. మండలానికి ఓ గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేసింది. గ్రామాల్లో అందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడంతో వారు ఎంపిక చేసిన వారే లబ్ధిదారులు అయ్యారు. ఈ రకంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన కొందరిపై వేటుపడగా మిగిలిన వారు ఇల్లు నిర్మించుకునే క్రమంలో పెట్టిన నిబంధనలు కూడా ఇబ్బందికరంగా మారాయి. ఇండ్లు మంజూరు చేసే ప్రొసీడింగ్స్‌లో ఎక్కడా కొలతలు మెన్షన్ చేయకపోవడంతో లబ్ధిదారులు తమకు తోచిన విధంగా మార్కింగ్ చేసుకొని బేస్మెంట్లు మొదలుపెట్టారు. తీరా 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల్లో నిర్మించే ఇండ్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం తేల్చింది. దీనివల్ల ఇప్పటికే లబ్ధిదారుల్లో కొందరు 600 చదరపు అడుగులకు పైగా ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన వారికి బిల్లులు ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో లబ్ధిదారులు ఇప్పటికే కట్టిన బేస్మెంట్లు కూల్చలేక, నిబంధన ప్రకారం ఇల్లు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన ఇండ్లు ఉన్న కొందరు పక్కన ఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నించినా అధికారులు ఒప్పుకోవడం లేదు. ఉన్న ఇంటిని కూల్చి కొత్తగా కడితేనే బిల్లులు వస్తాయని లబ్ధిదారుల ముఖం మీదనే చెప్పేస్తున్నారు. ఇలాంటి అర్థంపర్థం లేని నిబంధనలతో ప్రజలు విసిగిపోతున్నారు.

యువ వికాసానికి సిబిల్ స్కోరు నిబంధన

గత ప్రభుత్వ హయాంలో రుణాలు తీసుకున్న వారు, రుణాలు తీసుకొని వివిధ కారణాలతో చెల్లించని వారు అనర్హులని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పకనే చెప్తోంది. సిబిల్ స్కోర్ ఉంటేనే రుణాలు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లించే వారికి మాత్రమే సిబిల్ స్కోర్ బాగుంటుంది. కానీ.. రుణాలే తీసుకొని వారి పరిస్థితి ఏంటి అనేది ప్రభుత్వం ఆలోచించడం లేదు. వివిధ కార్పొరేషన్ల ద్వారా నల్లగొండ జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం మండల స్థాయిలో దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుండగా.. వచ్చే నెల రెండో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుదారుల్లో చాలామంది నిరుపేదలే ఉన్నారు. వారికి బ్యాంకులతో ఎలాంటి సంబంధాలు లేవు. వారిలో చాలా మందికి పాన్ కార్డులు కూడా లేవని తెలిసింది. ఇలాంటి వారికి సిబిల్ స్కోర్ ఎక్కడ నుంచి వస్తుందని ఆశావహులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ పథకం కింద బ్యాంకులు ఇచ్చేది నామమాత్రమే అయినా.. సిబిల్ స్కోర్‌తో లింకు పెట్టడం వల్ల వచ్చిన దరఖాస్తుల్లో 10 శాతం మందికి కూడా రుణాలు అందే పరిస్థితి కనిపించడం లేదు. రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు ఈ నెల 20వరకు మండల స్థాయిలో పరిశీలన పూర్తి చేసి జిల్లా కమిటీలకు సిఫారసు చేస్తారు. 21నుంచి 31వరకు జిల్లా స్థాయిలో పరిశీలించి మంజూరు పత్రాలు జారీ చేయాలి. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు రుణాల పంపిణీ ప్రారంభించి 9వ తేదీ వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ.. సిబిల్ స్కోర్ ప్రాతిపదికన ఎంపిక చేస్తే మాత్రం ఈ పథకాలకు ఎవరూ ఎంపికయ్యే పరిస్థితి ఉండదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. రూ.50వేల వరకు పూర్తి సబ్సిడీపై రుణం ఇస్తామన్నారు. లక్ష రూపాయల వరకు 80 శాతం, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు 70శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో బ్యాంకులు ఇచ్చే దానికంటే ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. కానీ.. లబ్ధిదారులను బ్యాంకర్లు నమ్మాల్సిన అవసరం కనిపిస్తుంది. అందుకే సిబిల్ స్కోర్ నిబంధన ప్రవేశపెట్టినట్లు తెలుస్తుంది. సిబిల్ స్కోర్ చూడాలంటే ఒక్క లబ్ధిదారుడు 100 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఉందో లేదో తెలియని రుణానికి ఇప్పటికే వందల్లో ఖర్చు చేశామని, ఇది మరో అదనపు ఖర్చు అని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 10శాతం దరఖాస్తుదారులకు కూడా రుణాలు వచ్చే అవకాశం కనిపించడం లేదని చర్చ జరుగుతుంది. ఏదో విధంగా లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకే ప్రభుత్వం ఇలాంటి మెలికలు పెడుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డిగ్రీలో ప్రవేశానికి 'దోస్త్'

- ఈ నెల 21వరకు తొలి విడుత రిజిస్ట్రేషన్లకు అవకాశం
- మూడు విడుతల్లో 'దోస్త్' అడ్మిషన్ల ప్రవేశాల ప్రక్రియ
- జూన్ 28తో అడ్మిషన్లు పూర్తి.. 30నుంచి తరగతులు ప్రారంభం
- ఎంజీయూ పరిధిలో ఉమ్మడి జిల్లాలో 68 కళాశాలల్లో 28వేల అడ్మిషన్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు

రామగిరి, మే 11 : తెలంగాణలో డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే 'దోస్త్' కట్టాల్సిందే. డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లలో పారదర్శకతకు 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ' (దోస్త్)ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి అందుబాటులోకి తెచ్చింది. దీనికి సంబంధించి 2025-26 సంవత్సరానికి నోటిఫికేషన్ జారీ చేయగా.. తొలి విడుత అడ్మిషన్లకు ఈ నెల 21వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. మూడు విడుతల్లో జరిగే అడ్మిషన్ల ప్రక్రియ జూన్ 28తో ముగియనుండగా.. 30నుంచి తొలి సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయి. విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్‌తోపాటు దోస్త్ మొబైల్ యాప్‌తో సైతం ఆన్‌లైన్ అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉంది. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 68 కళాశాలల్లో 28వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతేడాది 53శాతం సీట్లు మాత్రమే నిండగా.. ఈ పర్యాయం పూర్తిస్థాయిలో భర్తీ జరిగేనా అనేది సందేహంగానే ఉంది. అడ్మిషన్ల వివరాల కోసం ఎంజీయూతోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండిలా..

దోస్త్‌లో విద్యార్థులు తమ ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ లింక్ చేసుకుని http://dost.cgg.gov.in వెబ్‌సైట్‌లో గానీ DOST మొబైల్ యాప్‌లో గానీ లాగిన్ కాగానే దోస్త్ ఐడీ, పిన్ నెంబర్ వస్తుంది. వీటిని ఉపయోగించి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. ఓపెన్ అయిన సైట్‌లో యూనివర్సిటీ, కళాశాలలు, కళాశాలల వారీగా ప్రాధాన్యత క్రమంలో కోర్సుల ఎంపిక, వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలి. కోరుకున్న కళాశాలలో సీటు వస్తే సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కన్ఫర్మేషన్ చేసుకోవాలి. ఏ దశ కౌన్సిలింగ్‌లో అయినా సెల్ఫ్ రిపోర్టింగ్ ఎంచుకున్న కళాశాలకు వెళ్లి అన్ని ఒరిజినల్ ధృవపత్రాలు చూపించి వారు అక్కడ అడిగిన సర్టిఫికెట్స్ అందజేసి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ముఖ్యమైన తేదీలు..

- డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లకు ఫేజ్-1లో ఈ నెల 21వరకు ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- ఈ నెల 10నుంచి 22 వరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం ఉంది.
- ఈ నెల 29న వెబ్ ఆప్షన్ ఇచ్చిన విద్యార్థులకు తొలి విడుత సీటు అలాట్‌మెంట్ చేస్తారు.
- అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ నెల 30నుంచి జూన్ 6వరకు ఆయా కళాశాలల్లో (కళాశాల ఫీజు, సీటు రిజర్వేషన్ ఫీజు చెల్లించి) చేరడానికి ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.
- రెండో విడుత ఈ నెల 30నుంచి జూన్ 8వరకు రూ.400 చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్, వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలి.
- మూడో విడుత అడ్మిషన్లకు జూన్ 13నుంచి 19వరకు రూ.400 చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్‌కు అవకాశమిచ్చారు.
- జూన్ 30నుంచి సెమిస్టర్ -1 తరగతులు ప్రారంభమవుతాయి.